సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 16 । సెప్టెంబర్ । 2024



ముంచేస్తున్న బ్యాక్ వాటర్
భద్రాచలం వద్ద గోదావరి వరద నీటిమట్టం ఆధారంగా అధికారులు వేసే లెక్కలకు. గ్రామాలను ముంచెత్తే గోదావరి వరదకు పొంతన ఉండటం లేదు. 8లో



భార్యాభర్తల ఆత్మహత్య
కుటుంబ కలహాలతో భార్యాభర్తలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కామవరపుకోట మండలంలోని వెంకటాపురం గ్రామంలో చోటుచేసుకుంది. 8లో



నిందితుల అరెస్టు
ముదినేపల్లి మండలంలోని ఊటుకూరులో ఈనెల 7న జరిగిన హత్యకు సంబంధించిన కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. 8లో

ఆశలు సమాధి చేస్తూ.. మెడికలలను చిదిమేస్తూ..

వైద్య కళాశాలలకు 'చంద్ర' గ్రహణం

- పేద విద్యార్థులకు 'తెల్ల కోటు' దూరం
- మెడికల్ కాలేజీలకు కూటమి శాపం
- ఏలూరులో నిలిచిపోయిన నిర్మాణాలు
- 300 మందికి వసతి ప్రశ్నార్థకం!



ఏలూరు జీజీహెచ్‌లో నిర్మాణ పనులు ఆగిపోయిన శాశ్వత మెడికల్ కాలేజీ భవనం

ఏలూరు టౌన్: వైద్యరంగంలో విప్లవాత్మకమైన మార్పులకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఎన్నడూ లేనిరీతిలో రాష్ట్రంలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటుకు సంకల్పించారు. అయితే ఈ మహోన్నత యజ్ఞానికి ఇప్పుడు 'చంద్ర' గ్రహణం పట్టింది. గత ప్రభుత్వంలో ఏలూరు జిల్లాకే తలమానికంగా నగరంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఏర్పాటుచేశారు. అత్యాధునిక సౌకర్యాలు, ల్యాబ్స్, డిజిటల్ క్లాస్‌రూమ్స్ ఏర్పాటుతో చరిత్ర సృష్టించారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో ఈ కళాశాల శాశ్వత భవన నిర్మాణాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవటంతో భవనాల నిర్మాణ పనులు నిలిచిపోయాయి.



కాలేజీలపై కత్తి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన వైద్య కాలేజీలపై కూటమి ప్రభుత్వం కత్తి కట్టింది. గత ప్రభుత్వ హయాంలో ఏలూరు పాతబస్టాండ్ సమీపంలో మొదటి ఏడాది తరగతులు నిర్వహించేందుకు 2023 సెప్టెంబర్ నాటికి రూ.60 కోట్లతో రెండు అంతస్తుల భవనాన్ని నిర్మించారు. ఇక శాశ్వత భవనాలను ఏలూరు జీజీహెచ్‌లోని 22 ఎకరాల స్థలంలో నిర్మించేందుకు మెఘా ఇన్‌ఫ్రా కంపెనీ కాంట్రాక్ట్ తీసుకుంది. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడే వరకూ శరవేగంగా సాగిన పనులు మెల్లగా మందగిస్తూ ప్రస్తుతం నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేట్ భాగస్వామ్యంతో నడిపేందుకు ఆలోచనలు చేస్తోందనే ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో భవనాల నిర్మాణాలు ఎప్పటికి పూర్తి చేస్తారో ? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం నిర్ణయం మీదే వీటి భవిష్యత్ ఆధారపడి ఉంది.



చివరి దశలో నిలిచిపోయిన హాస్టల్ భవనాల పనులు

వేర్వేరుగా హాస్టల్ భవనాలు

ఏలూరు జీజీహెచ్ ప్రాంగణంలోనే మెన్, విమెన్ వైద్య విద్యార్థులకు ప్రత్యేకంగా రెండు హాస్టల్ భవనాలను శరవేగంగా నిర్మించారు. తుది దశకు చేరుకున్న భవనాల నిర్మాణ పనులు ప్రస్తుతం ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఒక్కో భవనాన్ని సుమారు 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో జీప్లస్ 6 తరహాలో నిర్మిస్తున్నారు. వీటి కోసం సుమారు రూ.35 కోట్ల నిధులు వెచ్చించనున్నారు. ప్రస్తుతం ఈ పనులు పూర్తి కాకపోవటంతో కొత్తగా ఎంబీబీఎస్‌లో చేరే విద్యార్థులకు హాస్టల్ వసతికి ఇబ్బందులు తప్పేలా కనిపించటంలేదు.

ఎక్కడికక్కడ నిలిచిన పనులు

ఏలూరు జీజీహెచ్‌లో సుమారు 22 ఎకరాల్లో మెడికల్ కళాశాల శాశ్వత భవనం, అడ్మినిస్ట్రేషన్ భవనం, బోధనాస్పత్రి నర్సింగ్ కళాశాల, ప్రొఫెసర్లు, నర్సింగ్ స్టాఫ్‌కు క్వార్టర్లు, మెన్, విమెన్ హాస్టల్ భవనాలు నిర్మాణాలు చేపట్టేలా డిజైన్ చేశారు. సుమారు రూ.525 కోట్ల భారీ నిధులతో గత ప్రభుత్వం పనులు చేపట్టింది. దీనిలో భాగంగా ఏలూరు జీజీహెచ్‌లో సుమారు రూ.90 కోట్లతో కళాశాలకు శాశ్వత భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. సుమారు 3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నాలుగు అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారు. ఇవన్నీ ప్రస్తుతం నిలిచిపోయాయి.

300 మంది విద్యార్థులకు వసతి ఎలా..

ఏలూరు జీజీహెచ్‌లో ఎంబీబీఎస్ ఫస్టియర్ విద్యార్థులు 150 మంది 2023 సెప్టెంబర్‌లో ప్రవేశాలు పొందారు. మెన్, విమెన్‌కు ప్రత్యేకంగా హాస్టల్‌కు తాత్కాలిక ప్రాతిపదికన ఏర్పాట్లు చేశారు. మరో నెల రోజుల్లో రెండో సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులతో పాటు కొత్తగా నీట్ కౌన్సెలింగ్‌లో సీటు సాధించిన విద్యార్థులు మరో 150 మంది ఇక్కడకు రానున్నారు. వీ రందరికీ ఎక్కడ హాస్టల్ వసతి కల్పిస్తారనే విషయాలపై గందరగోళం నెలకొంది. ఏలూరు జీజీహెచ్ లోని ఎంసీహెచ్ భవనంపై మూడో అంతస్తులో గ తేడాది విద్యార్థులకు హాస్టల్ కోసం ఏర్పాట్లు చేశారు. అయితే ఈ ఏడాది చేరే విద్యార్థులకు వసతి, భోజన సౌకర్యాలు కల్పించటంలో ఇబ్బందులు తప్పేలా లేవు.

భవన నిర్మాణాలు పూర్తి చేయాలి



మాజీ సీఎం జగన్ ఏలూరులో కార్పొరేట్ తరహాలో మెడికల్ కాలేజీ భవనాన్ని ఏర్పాటుచేశారు. శాశ్వత భవనాలు, బోధనాస్పత్రి భవనాలు, స్టాఫ్ క్వార్టర్లు, విద్యార్థులకు హాస్టల్ భవనాల నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు భాగస్వామ్యంలోకి తీసుకువెళ్లాలనే ఆలోచన చేయటం దారుణం. జిల్లాలోని ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందించే అవకాశం ఉన్న మెడికల్ కాలేజీ, బోధనాస్పత్రుల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలి. కొత్తగా ప్రవేశాలు పొందే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి.

– మామిళ్లపల్లి జయప్రకాష్,
వైఎస్సార్‌సీపీ ఏలూరు సమన్వయకర్త

న్యూస్‌రీల్

యోగా పోటీల్లో ప్రతిభ



ప్రశంసాపత్రం అందుకుంటున్న చంద్రశేఖర్

తాడేపల్లిగూడెం రూరల్: దండగర్ర జెడ్పీ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు బడుగు చంద్రశేఖర్ రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో తృతీయ స్థానాన్ని సాధించారు. జాతీయస్థాయిలో నవంబర్‌లో హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగే పోటీలకు అర్హత సాధించినట్టు చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. ఆయన్ను సర్పంచ్ పిల్లా రాంబాబు, హెచ్‌ఎం చంద్రశేఖర్, ఎస్‌ఎంసీ చైర్మన్ మరపట్ల పండియ్య అభినందించారు.

వివాదాస్పదంగా ఆలయంలో పనులు



ఆలయంలో పనులు చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్ : గుట్లపాడు గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నూతన గోపుర నిర్మాణ పనులు వివాదాస్పదంగా మారాయి. గోపుర నిర్మాణం వల్ల తమకు సమస్యలు ఎదురవుతాయని సమీపంలోని కొప్పర్తి సుబ్రహ్మణ్యేశ్వరరావు, మరికొందరు హైకోర్టులో కేసు వేశారు. ఈ వివాదం కోర్టు పరిధిలో ఉన్నా ఆదివారం ఆలయంలో కమిటీ సభ్యులు నిర్మాణ పనులు చేయిస్తున్నారని సుబ్రహ్మణ్యేశ్వరరావు విలేకరులకు తెలిపారు. అలాగే చిన్నపిల్లలతో కూడా పనులు చేయిస్తున్నారన్నారు. విషయాన్ని కలెక్టర్, సబ్ కలెక్టర్ దృష్టికి ఫోన్ ద్వారా తెలియజేశానని చెప్పారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణను వివరణ కోరగా విచారణ చేపట్టి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానన్నారు.

వైద్య కళాశాలల రద్దు దుర్మార్గం



నడపన గోవిందరాజుల నాయుడు, జెడ్పీటీసీ

పాలకొల్లు అర్బన్: రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలను సీఎం చంద్రబాబు రద్దు చేస్తూ ప్రైవేటు యాజమాన్యాలకు అప్పగించడం దుర్మార్గమని జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు విమర్శించారు. అలాగే పులివెందుల మెడికల్ కళాశాలకు కేంద్ర మెడికల్ బోర్డు మంజూరు చేసిన 50 సీట్లను రద్దు చేస్తూ చంద్రబాబు కేంద్రానికి ఉత్తరం రాయడం కక్షపూరిత చర్యలకు నిదర్శనమన్నారు. అలాగే పాలకొల్లు మండలం దగ్గులూరులో వైద్య కళాశాల పనులు నిలిపివేయడం సరికాదన్నారు.

స్వర్ణలతకు సాహితీ పురస్కారం

పాలకోడేరు : విస్సాకోడేరు చెందిన డాక్టర్ డీఆర్ స్వర్ణలత జాతీయ నంది సాహితీ పురస్కారం అందుకున్నారు. విజయవాడలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో నాసా పూర్వ శాస్త్రవేత్త చందు సాంబశివరావు, తెలుగు వెలుగు జాతీయ సంస్థ అధ్యక్షుడు సోలోజు రాజ్‌కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

గూడెం డీఎస్పీగా విశ్వనాథ్

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం సబ్ డివిజనల్ పోలీసు అధికారిగా (డీఎస్పీ) డి.విశ్వనాథ్‌ను నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన ఇంతకు ముందు సీబీడీ విభాగంలో డీఎస్పీగా పనిచేశారు. తాడేపల్లిగూడెం డీఎస్పీ డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తి ఏసీబీ డీఎస్పీగా వెళ్లనున్నారు.

నేడు 'పరిష్కార వేదిక' రద్దు

భీమవరం (ప్రకాశంచౌక్): మిలాద్ ఉన్ నబీ ప్రభుత్వ సెలవు దినం కావడంతో సోమవారం భీమవరం కలెక్టరేట్ కార్యాలయంలో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమం రద్దు చేసినట్టు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ప్రజలు గుర్తించాలన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..
భీమవరం: ప్రతి సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం మిలాద్-ఉన్-నబీ పండుగ సందర్భంగా రద్దు చేసినట్టు జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు.

2,633 కేసుల పరిష్కారం

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 14న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 2,633 కేసులు పరిష్కరించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ తెలిపారు. వీటిలో 23 కేసులను ఆన్‌లైన్ ద్వారా పరిష్కరించారన్నారు.

తీరంలో భారీ చోరీ

రూ.50 లక్షల నగలు అపహరణ



కేపీపాలెం నార్త్ గ్రామంలో బంగారు దుకాణంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

నరసాపురం రూరల్ : మొగల్తూరు మండలం కేపీపాలెం నార్త్ గ్రామంలోని శ్రీ దుర్గా జ్యూయలర్స్‌లో శనివారం రాత్రి భారీ చోరీ జరిగింది. రూ.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్టు బాధితులు తెలిపారు. ఆదివారం అడిషనల్ ఎస్పీ భీమారావు, సీఐలు దుర్గాప్రసాద్, పెద్దిరాజు, ఎస్సై వాసు, క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది ఘటనా స్థలంలో పరిశీలించి ఆధారాలు సేకరించారు. పోలీసులు వివరాల ప్రకారం.. షాపు యజమాని ఆదివారం ఉదయం 10 గంటలకు షట్టర్ తెరిచి చూడగా షాపు వెనుక భాగంలో గోడకు రంధ్రం పెట్టినట్టు గుర్తించారు. దొంగలు ఇలా లోనికి ప్రవేశించి సుమారు రూ.50 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు చోరీ చేసినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ చేసిన వ్యక్తి ఆధారాలు దొరకకుండా షాపులోని సీసీ కెమెరాలను ధ్వంసం చేసి కంప్యూటర్ హార్డ్ డిస్క్‌ను కూడా ఎత్తుకు పోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నరసాపురం ప్రాంతంలో వరుస చోరీలకు సంబంధించి ప్రత్యేక పోలీసు బృందాలు దర్యాప్తు చేస్తున్నాయి. ఇప్పటికే కొన్ని ఆధారాలు లభించాయని, త్వరలోనే దొంగలను పట్టుకుంటామని పోలీసులు చెబుతున్నారు.

17న నులిపురుగుల నివారణ దినం

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఈనెల 17న నులిపురుగుల నివారణ దినం సందర్భంగా 19 ఏళ్లలోపు పిల్లలకు ఆల్ బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సుమారు 3,64,400 మందికి మాత్రలు అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఆరోగ్యవంతమైన పౌరులను అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

రాయితీపై సౌర విద్యుత్
ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కింద సోలార్ విద్యుత్ కనెక్షన్లను రాయితీపై అందించనున్నట్టు కలెక్టర్ తెలిపారు. ఇంటి పైకప్పుపై కనీసం 10 చ.మీటర్లు లేదా 100 చ.అడుగుల స్థలంలో కిలోవాట్ సామర్థ్యం గల సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 1912 టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ముంపులోనే కనకాయలంక కాజ్‌వే



కాజ్‌వేపై వరద నీటిలో ప్రయాణిస్తున్న గ్రామస్తులు

యలమంచిలి: కనకాయలంక కాజ్‌వేను వరద ముంపు వీడటం లేదు. ఐదు రోజులుగా కాజ్‌వేపై వరద నీరు ప్రవహిస్తుండటంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆదివారం కొంచెం వరద నీరు తగ్గినా కాజ్‌వేపై రెండు అడుగుల ఎత్తులో ప్రవహిస్తుంది. అధికారులు పడవలను నిలిపివేయడంతో గ్రామస్తులు వరద నీటిలో వాహనాలపై, కాలినడకను రాకపోకలు సాగిస్తున్నారు. సోమవారం కాజ్‌వే పూర్తిగా ముంపు నుంచి బయటపడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

డంపింగ్ యార్డ్ పెడితే ఆత్మహత్య చేసుకుంటాం

- నరసాపురం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఆందోళన
- మండావారిగరువు మహిళల ఆగ్రహం



ఎమ్మెల్యే నాయకర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మండావారి గరువు మహిళలు

నరసాపురం: నరసాపురం మండలం రుస్తుంబాద శివారు మండావారి గరువులో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఇదే విషయంపై శనివారం 216 జాతీయ రహదారిపై ఆందోళన చేసిన గ్రామానికి చెందిన మహిళలు ఆదివారం పట్టణంలోని మిషన్ హైస్కూల్ రోడ్డులోని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ కార్యాలయాన్ని చుట్టుముట్టారు. కార్యాలయం బయట బైఠాయించి మున్సిపాలిటీ డంపింగ్ యార్డ్ తమ గ్రామంలో పెట్టడానికి వీలు లేదని నినాదాలు చేశారు. ఆ సమయంలో ఎమ్మెల్యే కార్యాలయంలో లేరు. అయితే ఎమ్మెల్యే ఎక్కడున్నా వచ్చి తమకు భరోసా ఇచ్చేవరకూ ఆందోళన విరమించేది లేదని వారు తెగేసి చెప్పారు. ఎమ్మెల్యే రావాలంటూ నినాదాలు చేశారు. దీంతో ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. ముగ్గురు మహిళలు పురుగు మందుల డబ్బాలతో ఆందోళనలో పాల్గొన్నారు. మున్సిపాలిటీలోని 31 వార్డుల్లోని చెత్తంతా తీసుకొచ్చి మా గ్రామంలో వేస్తే ఎలాగంటూ ప్రశ్నించారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిర్ణయం ఉపసంహరించుకోకపోతే పురుగు మందు తాగేస్తామని హెచ్చరించారు. చివరకు ఎమ్మెల్యే నాయకర్ ఫోన్‌లో ఆందోళనకారులతో మాట్లాడారు. సోమవారం గ్రామానికి వచ్చి అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. ఆందోళనలో ఉపసర్పంచ్ కాసా సత్యనారాయణ, గంగాభవానీ, యర్రంశెట్టి వెంకటనాగదుర్గ, మండా భాను, లక్ష్మీ కుమారి, సత్యభారతి తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర వైద్యం.. అందనంత దూరం

అందని ఆరోగ్యశ్రీ
- జిల్లాలో ఊపిరితిత్తులు, గ్యాస్ట్రో సేవలు నిల్
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న పేదలు
- 70 కిలోమీటర్లు ప్రయాణించి ఏలూరు వెళ్లాల్సిందే..
- అత్యవసరమైతే ప్రైవేట్ ఆస్పత్రులే దిక్కు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరానికి చెందిన శ్యామల అనే మహిళకు నాలుగు రోజుల క్రితం ఊపిరితిత్తులకు సంబంధించి సమస్య రావడంతో అత్యవసర వైద్యం అవసరమైంది. కుటుంబ సభ్యులు భీమవరంలో ఆరోగ్యశ్రీ (ఎన్టీఆర్ వైద్యసేవ)లో వైద్యం చేయించాలని ప్రయత్నించారు. తీరా చూస్తే ఊపిరితిత్తుల సమస్యలకు వైద్య సేవలు అందించడానికి భీమవరంలో ఏ ఆస్పత్రిలోనూ ఆరోగ్యశ్రీ సదుపాయం లేదు. భీమవరంలోనే కాదు జిల్లాలో ఏ ఆస్పత్రిలో కూడా ఆరోగ్యశ్రీలో ఈ సమస్యకు సేవలు లేవని తెలిసింది. దీంతో చేసేది లేక పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వేల రూపాయలు ఖర్చు చేసి అత్యవసర వైద్యం చేయించారు. ఇది ఒక్క శ్యామల సమస్య కాదు.. జిల్లాలో పేదలు ఊపిరితిత్తులతో పాటు గ్యాస్ట్రో సమస్యలకు సంబంధించి ఆరోగ్యశ్రీ పథకంలో సేవలందించే ఆస్పత్రులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ ఆస్పత్రులలో చేరుతున్నారు.

70 కిలోమీటర్లు వెళ్లాల్సిందే..
జిల్లా ప్రజలు ఊపిరితిత్తులు, గ్యాస్ట్రో సమస్యలకు ఆరోగ్యశ్రీలో వైద్యం పొందాలంటే సుమారు 70 కిలోమీటర్లు ప్రయాణించి ఏలూరు వెళ్లాల్సిన పరిస్థితి. అక్కడ ఆశ్రమం ఆస్పత్రిలో ఈ సమస్యలకు సంబంధించి ఆరోగ్యశ్రీలో ఉచితంగా సేవలందిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఏలూరు వెళ్లేందుకు చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. అంబులెన్స్‌లలో 70 కిలోమీటర్లు వెళ్లేందుకు భయపడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేర్పి లక్షలు ఖర్చు పెడుతున్నారు.

కలెక్టర్ స్పందించాలి
జిల్లాలో ఆరోగ్యశ్రీలో ఊపిరితిత్తులు, గ్యాస్ట్రో సమస్యలకు చికిత్సలు అందించేలా ప్రభుత్వం, కలెక్టర్ స్పందించాలని పేద, మధ్యతరగతి వర్గాలు కోరుతున్నాయి. అలాగే అన్నిరకాల ఆరోగ్య సమస్యలకు జిల్లాలో ఆరోగ్యశ్రీలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అంటున్నారు. వైద్య రంగంలో ముందంజలో ఉన్న భీమవరంలో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు అందుబాటులో ఉన్నా.. పై రెండు సమస్యలకు సంబంధించి ఆరోగ్యశ్రీలో సేవలందడం లేదు. అలాగే మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అన్ని వ్యాధులకు ఆరోగ్యశ్రీలో స్థానికంగా వైద్య సేవలు అందేలా చూడాలని అంటున్నారు.

'ధన'నాథుడు



గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కరెన్సీ అలంకరణ ఆకట్టుకుంది. నరసాపురం 31వ వార్డు చినమామిడిపల్లిలోని నాగారమ్మ ఆలయం వద్ద మండపంలో గణపతి విగ్రహాన్ని ఆదివారం రూ.6 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు.

– నరసాపురం

క్లుప్తంగా

అశోక్‌కు విజయమ్మ నివాళి



అశోక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్ విజయమ్మ

కామవరపుకోట: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కళ్లచెరువుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత మేడవరపు అశోక్ శ్రీనివాస్ కుటుంబసభ్యులను వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాతృమూర్తి వైఎస్ విజయమ్మ ఆదివారం పరామర్శించారు. ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం కళ్లచెరువుకు వచ్చిన విజయమ్మ అశోక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. దివంగత వైఎస్సార్‌కు సన్నిహితులైన రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ రామచంద్రరావుకు అశోక్ బావమరిది. వైఎస్సార్ కుటుంబంతో అశోక్‌కి ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకుని ఆమె విచారం వ్యక్తం చేశారు. అధైర్యపడవద్దని, అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

వేధింపులు తాళలేక ఆత్మహత్య

మొగల్తూరు: వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మొగల్తూరు మండలం నక్కావారిపాలెంలో చోటుచేసుకుంది. మొగల్తూరు ఎస్‌ఐ జి.వాసు తెలిపిన వివరాల ప్రకారం భూసి ఝాన్సీ మేరీ (32) ఈ నెల 13న రాత్రి బహిర్భూమికి వెళ్లింది. అదే గ్రామానికి చెందిన నలుగురు యువకులు వేధించడంతో.. మనస్తాపం చెంది ఇంటికి వచ్చి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మాలల జేఏసీ రాష్ట్ర కన్వీనర్‌గా జోసెఫ్



కోనా జోసెఫ్

కాళ్ల: ఆంధ్రప్రదేశ్ 26 జిల్లాల ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక మాలల జేఏసీ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాలల జేఏసీ కన్వీనర్‌గా కాళ్ల మండలం ఏలూరుపాడు గ్రామానికి చెందిన కోన జోసెఫ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జేఏసీ నాయకులు ఆదివారం తెలిపారు. 26 జిల్లాల మాలల జేఏసీ అధ్యక్షులతో పాటు అందరూ ఏకగ్రీవంగా జోసఫ్‌ను ఎన్నుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెంటపాడు: పెంటపాడు మండలం ముదునూరు వద్ద ఆదివారం జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పెంటపాడు ఎస్సై స్వామి తెలిపిన వివరాల ప్రకారం అత్తిలికి చెందిన ఏడిద సత్యనారాయణ (69) గూడెం మార్కెట్‌లో పనిచేసేవాడు. రోజూ పని పూర్తయిన తరువాత స్వగ్రామం అత్తిలికి బైక్‌పై బయలుదేరాడు. అదే సమయంలో ముదునూరు వద్ద గూడెం వైపు వస్తున్న వాహనం సడన్‌గా ఢీకొట్టడంతో సత్యనారాయణ అక్కడికక్కడే తీవ్ర గాయాల పాలై మృతి చెందాడు.

మాధవరంలో చోరీ

తాడేపల్లిగూడెం రూరల్: మహిళకు మత్తు మందు ఇచ్చి దొంగతనానికి పాల్పడిన సంఘటన మాధవరంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల ప్రకారం.. గోపిశెట్టి శ్రీనివాస్ భార్య శ్రీలతను గుర్తు తెలియని వ్యక్తి వచ్చి మంచినీరు అడిగాడు. తీసుకొచ్చేందుకు వెళ్తుండగా దుండగుడు మత్తు మందు చల్లిన కర్చీఫ్ ఆమె ముక్కు వద్ద ఉంచడంతో స్పృహ కోల్పోయింది. తల్లి వచ్చి చూసే సరికి శ్రీలత స్పృహ కోల్పోయి ఉంది. 14 కాసులు బంగారం, నగదు రూ.5.80 లక్షలు చోరీకి గురైనట్లు గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు.

ముంచేస్తున్న బ్యాక్ వాటర్

- తప్పుతున్న గోదావరి నీటి మట్టం లెక్కలు
- భయంతో బతుకుతున్న వేలేరుపాడు మండల ప్రజలు



48 అడుగుల నీటిమట్టానికే మునిగిన వేలంపల్లి శ్రీరామకృష్ణ మునివాటం శివాలయం

వేలేరుపాడు: భద్రాచలం వద్ద గోదావరి వరద నీటి మట్టం ఆధారంగా అధికారులు వేసే లెక్కలకు, గ్రామాలను ముంచెత్తే గోదావరి వరదకు పొంతన ఉండటంలేదు. గతంలో పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టకముందు ఏ విధమైన ముంపు నీటిమట్టాలు ఉన్నాయో నేటికీ అదే ప్రామాణికంగా తీసుకుని ముంపును అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం పోలవరం బ్యాక్ వాటర్ వల్ల నీటిమట్టాలు పూర్తిగా మారిపోయాయి. ఆకస్మికంగా గ్రామాలు నీట మునిగిపోతున్నాయి. దీంతో పోలవరం ముంపు మండలమైన వేలేరుపాడు మండలంలో ప్రజలు భయంగా కాలం గడుపుతున్నారు. భద్రాచలం వద్ద 43 అడుగులకు మొదటి హెచ్చరిక, 48 అడుగులకు రెండోది, 53 అడుగులకు మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. దీని ప్రకారమే ముంపు ప్రభావిత గ్రామాలను ఖాళీ చేయిస్తారు. భద్రాచలం వద్ద వరద నీటిమట్టానికి గ్రామాలను ముంచెత్తే వరదకు పది నుంచి పన్నెండు అడుగుల వ్యత్యాసముంటోంది. వేలేరుపాడు మండలంలో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తే 24 హ్యాబిటేషన్లలో 2437 మంది, మూడో ప్రమాద హెచ్చరికకు 31 హ్యాబిటేషన్లలో 3,322 మంది నిరాశ్రయులవుతున్నారు.



49 అడుగుల నీటిమట్టానికే నీట మునిగిన టేకుపల్లి గ్రామం



మూడు నెలలుగా నీట మునిగి ఉన్న ఎద్దెలవాగు వంతెన

ఆకస్మికంగా మునిగిపోతున్న గ్రామాలు

భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తే నీటమునిగే గ్రామాలు ఆకస్మికంగా మునిగిపోతున్నాయి. పేరంటపల్లి, టేకుపల్లి, కాకిస్‌నూరు, చిన్నమంకోలు, పెద్దమంకోలు, టేకూరు, గ్రామాలు 48 అడుగులకే నీటమునుగుతున్నాయి. గతంలో 60 అడుగుల నీటి మట్టం దాటితే ఈ గ్రామాలు మునిగేవి. పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీరామకృష్ణమునివాటం ఆలయం కూడా భద్రాచలం వద్ద 60 అడుగులు దాటితే మునిగేది. ప్రస్తుతం 48 అడుగులకే మునిగిపోయింది. ఇదంతా పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ ప్రభావమేనని పలువురు భావిస్తున్నారు.

మూడు నెలలుగా ముంపులోనే వంతెనలు

భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తే నీట మునిగే వేలేరుపాడు నుంచి కొయిదా వెళ్ళే రహదారిలో ఎద్దెలవాగు, టేకూరు వాగుల వంతెనలు భద్రాచలం వద్ద 28 అడుగుల నీటి మట్టం వస్తేనే నీటమునుగుతున్నాయి. జులై 19 నుంచి నేటి వరకు ఈ వంతెనలు నీటమునిగే ఉన్నాయి. భద్రాచలం వద్ద నీటిమట్టం తగ్గినా గోదావరి వరద నేటికీ తగ్గుముఖం పట్టలేదు. గత మూడు నెలలుగా గ్రామాలను వరద వెంటాడుతోంది. దీంతో దిగువ ప్రాంతంలో 18 గిరిజన గ్రామాల ప్రజలు దాదాపు మూడు నెలలుగా జలదిగ్బంధంలోనే ఉంటూ పడరాని పాట్లు పడుతున్నారు.

భద్రాచలం వద్ద 43 అడుగుల నీటి మట్టం ఉంటే వేలేరుపాడు మండల కేంద్రంలో వరద ప్రభావం ఎక్కువగా ఉంటోంది. పోలవరం బ్యాక్ వాటర్ వల్ల.. 58 అడుగుల నీటి మట్టానికి నీటమునిగే వేలేరుపాడు సంతబజారు, చాకలిబజారు 48 అడుగులకే నీటమునుగుతోంది.

48 అడుగులకే వేలేరుపాడు మునక



గతంలో పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టకముందు భద్రాచలం వద్ద 58 అడుగులకు నీటిమట్టం చేరితే వేలేరుపాడు సంతబజారు నీటమునిగేది. ప్రస్తుతం 48 అడుగులకే మునుగుతోంది. శబరి, పెద్దవాగు, బ్యాక్ వాటర్ ప్రభావంతో తొందరగా మునుగుతుంది.

–బడిగంటి సత్యనారాయణ, వేలేరుపాడు

గ్రామమంతా మునిగింది



టేకుపల్లి గ్రామం గోదావరి ఒడ్డున ఉన్నా భద్రాచలం వద్ద 60 అడుగుల నీటిమట్టం దాటితే నే గతంలో వరదలు వచ్చినప్పుడు మునిగేది. ఇప్పుడు 48 అడుగులకే నీరు ముంచుతోంది. వరదొస్తే పక్కనే ఉన్న గుట్టపై తలదాచుకుంటున్నాం. వర్షాకాల మంతా ఇదే పరిస్థితి.

–పిట్ల మంగిరెడ్డి, టేకుపల్లి గ్రామం

మూడు నెలలుగా నరకం



గత మూడు నెలలుగా ఎద్దెలవాగు, టేకూరు వాగులు నీట మునిగే ఉన్నాయి. భద్రాచలం వద్ద నీటి మట్టం తగ్గినా ముంపు నుంచి వంతెనలు బయటపడటం లేదు. వంతెనలు 28 అడుగులకే మునుగుతున్నాయి. మూడు నెలలుగా రహదారి సౌకర్యం లేక నరకం అనుభవిస్తున్నాం.

–లక్ష్మణ్, కట్కూరు సర్పంచ్

నిమజ్జన వేడుకల్లో ఇరు వర్గాల ఘర్షణ

నరసాపురం రూరల్: నరసాపురం మండలంలోని ఎల్బీచర్ల గ్రామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన వినాయక నిమజ్జన వేడుకల్లో ఇరు వర్గాల మధ్య ఘర్షణలో ఒకరిపై ఒకరు రాళ్లదాడికి పాల్పడ్డారు. ఊరేగింపులో ఏర్పాటు చేసిన సినిమా పాటల విషయంలో రెండు సామాజిక వర్గాల మధ్య వివాదం చెలరేగింది. దీంతో ఒకరిపై ఒకరు రాళ్ల దాడికి దిగారు. ఇరువర్గాలను అదుపు చేసే క్రమంలో విధుల్లో ఉన్న కానిస్టేబుల్ రాజేష్‌పై దాడి చేయడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న సీఐ దుర్గా ప్రసాద్, మొగల్తూరు ఎస్సై జి.వాసు తమ సిబ్బందితో రాత్రి 9 గంటల ప్రాంతంలో పరిస్థితి అదుపు చేసే ప్రయత్నం చేశారు. సమీపంలో ఉంచిన పోలీసు వాహనాన్ని కూడా పాక్షికంగా ధ్వంసంచేశారు.

వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీల చించివేత



అడవి నెక్కలం వద్ద వైఎస్ఆర్ సీపీ ఫ్లెక్సీని చించేసిన దృశ్యం

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి మండలం అడవి నెక్కలం అంబేడ్కర్ నగర్ వద్ద స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం నూజివీడు రూరల్ మండలం బురువంచకు చెందిన ఐ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బేతమాల మణి రత్నం ఆదివారం సాయంత్రం వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీని చూసి తట్టుకోలేక ఫ్లెక్సీని ధ్వంసం చేశాడు. అక్కడే ఉన్న కొంతమంది వైఎస్సార్‌సిపి కార్యకర్తలు అడ్డుకోపోతుండగా వారిపై కర్రతో దాడి చేసి పారిపోతుండగా కార్యకర్తలు పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో పతకాల పంట



నాలుగు రాష్ట్రాల్లో పతకాలు సాధించిన ఏలూరు ఖేలో ఇండియా సెంటర్ బాలికలు

ఏలూరు రూరల్ : ఖేలో ఇండియా సెంటర్ బాలికలు రాష్ట్ర స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించారని సెంటర్ ఇన్‌చార్జి డీఎస్‌వీ వినాయక్‌ప్రసాద్ తెలిపారు. ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 8 వరకూ ఆంధ్రప్రదేశ్, కేరళ, తెలంగాణ, యానాంలో నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సెంటర్ లిఫ్టర్ల పలు విభాగాల్లో పాల్గొన్నారని వివరించారు. అనకాపల్లిలో నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఎం.పావని గోల్డ్ మెడల్, సీహెచ్ కీర్తన, జి.పవిత్ర, సీహెచ్ హారికా రెడ్డి మూడు సిల్వర్ మెడల్స్ సొంతం చేసుకున్నారని వివరించారు. ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 3 వరకూ కేరళ రాష్ట్రం త్రిస్సూర్‌లో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న రేణు మోల్, పి.దివ్య రెండు గోల్డ్ మెడల్స్ సొంతం చేసుకున్నారని వెల్లడించారు. తెలంగాణలోని భువనగిరిలో నిర్వహించిన పోటీల్లో జి.సాహితి రెండు గోల్డ్, ఒక సిల్వర్, ఎస్.వర్షిణి గోల్డ్, ఏ తేజశ్రీ సిల్వర్ మెడల్ సొంతం చేసుకున్నారు.

ఘనంగా ఉత్కర్ష్ ఫెస్టివల్



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న సౌత్ సెంట్రల్ రైల్వే సీనియర్ డివిజనల్ ఇంజనీర్ కేడీఎస్ కృష్ణ

నరసాపురం రూరల్: నరసాపురం మండలం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో ఉత్కర్ష్ 2024 పేరుతో గత రెండు రోజులపాటు నిర్వహించిన నేషనల్ ఫెస్ట్ కార్యక్రమం ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. వివిధ కళాశాలల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా విజయవాడ సౌత్ సెంట్రల్ రైల్వే సీనియర్ డివిజనల్ ఇంజనీర్ కేడీఎస్ కృష్ణ హాజరయ్యారు. 16 టెక్నికల్, నాన్ టెక్నికల్ కాంపిటేషన్లు జరిగాయి. 32 మంది విద్యార్థులు ప్రతిభ చూపారు. కన్వీనర్‌గా కె.రాజు, కో కన్వీనర్‌గా కుమారి, యు జెన్నీగ్రేస్ వ్యవహరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కెవీ సత్యనారాయణ, కోశాధికారి కొండవీటి త్రినాథ్, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ఐటీ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ రామాయణం ప్రసాద్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

చెస్ విజేతలకు బహుమతుల అందజేత



చెస్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ కళ్యాణ మండపంలో జిల్లా చెస్ అసోసియేషన్, అనసూయ చెస్ అకాడమీల ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన ఇంటర్నేషనల్ బిలో 1600 రేటింగ్ చెస్ టోర్నమెంట్–2024 పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆదివారం సాయంత్రం బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథులుగా కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు హాజరయ్యారు. వివిధ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో క్రీడాకారులు విచ్చేసి మేధాశక్తితో తమ సత్తాను ప్రదర్శించుకుని, రేటింగ్ తో పాటు నగదు బహుమతులు సాధించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. చదరంగం అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ ఐలూరి హరి సూర్యనారాయణ రూ.60 వేలు(ప్రథమ), ఎం.దివాకరన్ రూ.50 వేలు(ద్వితీయ), తురక రాజు రూ.35 వేలు(తృతీయ) బహుమతి గెలుచుకున్నారని, వివిధ గ్రూపుల్లోని 50 మంది విజేతలకు నగదు బహుమతులతో పాటు, మెమొంటోలు అందించామని తెలిపారు.

తేజకు ఉత్తమ ఇంజనీర్ అవార్డు



యువ ఇంజనీర్ తేజకు అవార్డు అందజేస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సివిల్ ఇంజనీరింగ్ రంగంలో విశేష ప్రతిభ చూపిన ఔత్సాహిక ఇంజనీర్లను ప్రోత్సహించేందుకు ది హిందూ న్యూస్, రామ్ కో సిమెంట్స్ సంస్థలు యువ ఇంజనీర్లకు అవార్డులు ప్రకటించాయి. ఈ అవార్డుల్లో ఏలూరుకు చెందిన యువ ఇంజనీర్ సూరత్తు తేజ రిపేర్స్ అండ్ రీ హ్యాబిలిటేషన్ కేటగిరీలో ఎంపికయ్యారు. ఏలూరు కార్పొరేషన్ భవనాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి ఆధునీకీకరించి నూతన భవనంలా తీర్చిదిద్దడంలో తేజ ప్రదర్శించిన ప్రతిభకు ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆ సంస్థలు ప్రకటించాయి. ఈ అవార్డును ఆదివారం తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్శిటీ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో తేజకు అందచేశారు. తేజను నగరానికి చెందిన పలువురు ఇంజనీర్లు అభినందించారు.

ఉరి వేసుకుని యువకుడి మృతి

ఆకివీడు: మండలంలోని కాలింగగూడెంకు చెందిన సువారి సురేష్(23) ప్రేమను ఇంట్లో తిరస్కరించడంతో ఆదివారం ఇంట్లో ఉరేసుకుని మరణించినట్లు తండ్రి ఫిర్యాదు చేశాడని ఎస్సై హనుమంతు నాగరాజు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

టైరు మారుస్తుండగా దూసుకొచ్చిన మృత్యువు



ఎడ్ల కృష్ణ, మృతుడు(31)



రవికిషోర్, మృతుడు(25)

నిడమర్రు: కూటికోసం జిల్లాలు దాటి వెళ్లిన ఇద్దరు యువకులను దూసుకొచ్చిన మృత్యువు కబళించింది. కారు టైరు పంక్చరవడంతో రోడ్డు మార్జిన్‌లో వాహనం నిలిపి టైరు మారుస్తుండగా గుర్తుతెలియని వాహనం వీరిని ఢీకొని వెళ్లిపోయింది. ఈ దుర్ఘటనలో ఒకరు అక్కడికక్కడే మరణించగా, మరో వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. నిడమర్రుకు చెందిన ఎడ్ల కృష్ణ(31), రవికిషోర్(25) డ్రైవర్లుగా పనిచేస్తూ జీవిస్తున్నారు. కాకినాడలోని రొయ్యపిల్లల హేచరీలో పనిచేస్తున్నారు. శనివారం నెల్లూరు జిల్లా గూడూరు వెళ్లి రొయ్యసీడ్ తీసుకుని వాహనంపై కాకినాడ వెళ్తుండగా పల్నాడు జిల్లా తిమ్మాపురం వద్ద టైరు పంక్చరయింది. రోడ్డు పక్కన మార్జిన్‌లో వాహనాన్ని నిలిపి టైరు మారుస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. కృష్ణ అక్కడికక్కడే మరణించగా, తీవ్రంగా గాయపడిన రవికిషోర్‌ను చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ మరణించారు. కృష్ణకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రవికిషోర్‌కు తండ్రిలేకపోవడంతో తల్లితోపాటు అమ్మమ్మ తాతయ్యలు ఇతనిపైనే ఆధారపడ్డారు.

బైక్ చోరీ

నరసాపురం: పట్టణంలోని కాటన్‌పార్కు వద్ద బైక్ చోరీకి గురైంది. ఎస్సై జయలక్ష్మి తెలిపిన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని 22వవార్డు కొత్త కాలనీకి చెందిన పొన్నాడ వర్మ గత నెల 4న సాయంత్రం స్నేహితుడితో కలసి పార్కుకు వెళ్లి తిరిగి వచ్చి చూడగా పార్క్ చేసిన బైక్ కనిపించ లేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

షాపును ఢీకొట్టిన ఆటో



శివాలయం ఆర్చిగేటు కూడలిలో షాపు షటర్‌ను ఢీకొట్టి నిలిచిన ఆటో

ద్వారకాతిరుమల: శ్రీవారి దర్శనానంతరం గ్రామానికి ఆటోలో తిరుగు ప్రయాణమైన ఒక భక్తుడి కుటుంబానికి ఆదివారం త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. ఘాట్ రోడ్డులో వెళ్తుండగా ఆటో బ్రేక్‌లు విఫలమై ఒక షాపు షట్టర్‌ను ఢీకొట్టి నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. నూజివీడు సమీపంలోని దేవరకొండకు చెందిన చంపాల రామాంజనేయులు కుటుంబ సభ్యులతో కలసి తన ఆటోలో ద్వారకాతిరుమల క్షేత్రానికి విచ్చేశాడు. స్వామివారి దర్శనానంతరం స్వగ్రామానికి తిరుగుప్రయాణం అయ్యారు. శివాలయం ఘాట్‌రోడ్డు లోంచి వెళుతున్న సమయంలో ఆటో బ్రేక్‌లు ఒక్కసారిగా విఫలమయ్యాయి. స్థానిక ఆర్చిగేటు వద్దకు వచ్చేసరికి ఎదురుగా కార్లు ఉండటంతో రామాంజనేయులు ఆటోను పక్కనే ఉన్న షాపుల వైపుకు తిప్పాడు. దాంతో ఆటో షాపు షట్టర్‌ను ఢీకొట్టి నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో ఆంజనేయులు తలకు, అతని పక్కన కూర్చున్న మరో వ్యక్తికి స్వల్ప గాయాలు కాగా, ఆటోలో ఉన్న మరో 10 మంది పెద్దలు, పిల్లలు సురక్షితంగా బయటపడ్డారు. ఆంజనేయులను స్థానికులు హుటాహుటీన స్థానిక పీహెచ్‌సీకి తరలించి, చికిత్సనందించారు.

భార్యాభర్తల ఆత్మహత్య



సంఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర

కామవరపుకోట: కుటుంబ కలహాలతో భార్యాభర్తలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని వెంకటాపురంలో జరిగింది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తణుకు మండలం పిట్టల వేమవరం గ్రామానికి చెందిన మానుపాటి శ్రీనుకి(32) మండలంలోని రావికంపాడు పంచాయతీ వెంకటాపురానికి చెందిన సేనాపతి మరియమ్మకు(26) పదేళ్ల క్రితం వివాహమైంది. శ్రీను లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి ఒక కుమారుడు. భార్యాభర్తలు గొడవ పడి ఏడేళ్ల క్రితం విడిపోయారు. ఇటీవల పెద్దల సమక్షంలో సర్ది చెప్పి ఒకటి చేశారు. శనివారం రాత్రి శ్రీను డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చాక.. భార్య భర్తలు ఒకే గదిలో నిద్రించారని, ఆదివారం ఉదయం బంధువులు లేచి చూసేసరికి గదిలో మంచం మీద మరియమ్మ, గదిలో వేలాడుతూ శ్రీను మృతి చెందారని తెలిపారు. శీను ఇటీవల వేరో అమ్మాయితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని, దాంతో భార్యాభర్తలిద్దరికీ తరచూ గొడవలు జరుగుతున్నాయని అంటున్నారు. శ్రీను కావాలనే మరియమ్మ నోట్లో పురుగుల మందు పోసి గొంతు నులిమి చంపేసి, ఆత్మహత్య చేసుకున్నాడని మరియమ్మ బంధువులు ఆరోపిస్తున్నారు. డీఎస్పీ యు.రవిచంద్ర, సీఐ డి.కృష్ణబాబు, తడికలపూడి ఎస్సై పి.చెన్నారావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతులను పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

పాముకాటుతో ఏడేళ్ల బాలిక మృతి



చిన్నారి మధుర మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబీకులు

ఉండి: పాముకాటుకు గురై ఏడేళ్ళ చిన్నారి మృతి చెందింది. బంధువుల వివరాల ప్రకారం మహదేవపట్నంలోని శివాలయం వెనుక ప్రాంతంలో నివసిస్తున్న సతీష్, దుర్గ దంపతుల కుమార్తె శనివారం రాత్రి 7 గంటల సమయంలో సాలిపేట రామాలయం వద్ద వుండే అమ్మమ్మ, తాతయ్య ఇంటికి వచ్చింది. ఇంటి దడి పక్కనే ఉన్న తాచుపామును తొక్కడంతో పాము కరిచింది. దీంతో భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో సరైన చికిత్స అందక పోవడంతో చిన్నారి మృతి చెందిందని బంధువుల తెలిపారు. దీంతో ఆసుపత్రి ముందు బంధువులు బైఠాయించి ధర్నాకు దిగారు. ఆదివారం ఉదయం చర్చల అనంతరం మృతదేహాన్ని తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఉండి: ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం గ్రామానికి చెందిన రేషన్ షాపు నుంచి క్వింటాల్ బియ్యాన్ని తరలిస్తుండగా స్థానికుల సమాచారం మేరకు అధికారులు పట్టుకున్నారు. సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దారు మహేష్ ఆధ్వర్యంలో బియ్యం స్వాధీనం చేసుకుని వివరాలు నమోదు చేసుకుని అదే గ్రామానికి చెందిన మరో రేషన్ షాపునకు తరలించారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్సై

ముదినేపల్లి రూరల్: ఊటుకూరులో ఈ నెల 7న జరిగిన హత్యకు సంబంధించిన కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. కైకలూరు రూరల్ సీఐ డి.కృష్ణకుమార్, ముదినేపల్లి ఎస్సై డి.వెంకటకుమార్ ఆదివారం వివరాలు వెల్లడించారు. ఊటుకూరుకు చెందిన పోసిన బాలకోటయ్యను పాతకక్షల నేపథ్యంలో గూడవల్లి శ్రీనుబాబు హత్య చేశారు. ఈ హత్యకు పరోక్షంగా శ్రీనుబాబు తండ్రి శివాజీ, బాబాయి శ్రీనివాసరావు, పెదనాన్న మహంకాళరావు సహకరించినట్లు తెలిపారు. మృతుడు బాలకోటయ్య జేసీబీలతో పనులు చేయిస్తుండేవాడు. ఇందుకు సంబంధించి మరో జేసీబీల నిర్వాహకుడు పక్కిరి నాగరాజుతో విభేదాలున్నాయని ఈ కారణం వల్ల నాగరాజు సైతం హత్యకు సహకరించినట్లు తెలిపారు. వీరిని ఆదివారం అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

తాడేపల్లిగూడెం అర్బన్ : ఈ నెల 11న రాత్రి 6వ వార్డులో నలుగురు యువలకుతో ఘర్షణలో గాయపడిన ప్రసన్నకుమార్ ఆదివారం మృతి చెందాడు. సీఐ సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల ప్రకారం..ప్రసన్నకుమార్‌ను తొలుత రాజమండ్రిలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా.. అనంతరం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు.

శిల్పి కరుణాకర్ వడయార్‌కు సత్కారం



తుమ్మలపల్లి కళా క్షేత్రంలో శిల్పి కరుణాకర్ వడయార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: ప్రముఖ కళాకారుడు పెనుమంట్ర మండలం నత్త రామేశ్వరం గ్రామానికి చెందిన ఏకే ఆర్ట్స్ అధినేత కరుణాకర్ వడయార్‌ను శనివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం మొల్లమాంబ విగ్రహావిష్కరణ సందర్భంగా కృష్ణదత్త చామరాజ వడయార్(మైసూర్ మహారాజు) విగ్రహావిష్కరణ సందర్భంగా వడయార్‌ను సన్మానించారు. మైసూర్ మహారాజ చేతుల మీదుగా ఘన సత్కారం అందజేశారు. వడయార్‌ను పలువురు అభినందించారు.

క్లుప్తంగా

గణనాథుడి సన్నిధిలో అన్నసమారాధన



తణుకులో అన్న సమారాధనలో అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

తణుకు అర్బన్: వినాయకచవితి మహోత్సవాల్లో భాగంగా తణుకు ఆపిల్ ఆస్పత్రి ప్రాంతంలో శ్రీబాల గణపతి యూత్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. ముందుగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నసమారాధన ప్రారంభించారు. 4వేల మంది భక్తులు అన్నసమారాధనకు హాజరై ప్రసాదాన్ని స్వీకరించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఏచూరి పోరాటాలు స్ఫూర్తిదాయకం



సీఐటీయూ నాయకులచే సంతాప సభ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజా జీవితంలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చేసిన సేవలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. సీతారాం ఏచూరి సంతాప సభ పట్టణంలోని తాలూకా రైల్వే గూడ్స్‌షెడ్డు వద్ద నిర్వహించారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తి కోదండరామిరెడ్డి, చిర్ల పుల్లారెడ్డిలు మాట్లాడుతూ ఏచూరి జీవిత విశేషాలను, ఆయన పోరాటాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కార్మికులు పాల్గొన్నారు.

20న 'గూడెం' మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 20న ఉదయం 10 గంటలకు మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంపీపీ పానుకుమాటి శేషులత అధ్యక్షతన జరిగే సమావేశానికి అధికారులు, సభ్యులు విధిగా హాజరు కావాలని కోరారు.

సెల్ టవర్ నిర్మాణం వద్దంటూ ఆందోళన



సెల్‌ఫోన్ టవర్ నిర్మాణం చేపట్టవద్దని స్థానికులు ఆందోళన, మాట్లాడుతున్న స్థానికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సెల్ టవర్ నిర్మాణం వద్దంటూ స్థానిక గాయత్రిగుడి గోనుసంచీల వారి వీధిలోని స్థానికులు ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టవర్ నిర్మాణం వల్ల మానసికంగా, శారీరకంగా అనేక వ్యాధులకు గురి అవుతామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా ఇదే ప్రాంతంలో ఇప్పటికే ఒక టవర్ ఉందని, ఒకే వీధిలో 75 మీటర్ల దూరంలో మరో టవర్ నిర్మించడం ఏమిటి? అంటూ ప్రశ్నించారు. టవర్ నిర్మాణం ఆపేవరకు ధర్నా చేస్తామని స్థానికులు సదరు ప్రైవేట్ సంస్థను హెచ్చరించారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సేవలు అభినందనీయమని పలువురు వక్తలు తెలిపారు. ఆదివారం స్థానిక కడకట్లలోని జనతా చారిటబుల్ ట్రస్టు వారి ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణ నేత్ర వైద్యశాల వైద్యులచే 75 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. 10 మందికి ఆపరేషన్‌లు నిమిత్తం నిడదవోలుకు తీసుకువెళ్లారు. 20 మందికి ఉచితంగా కళ్లజోడ్లు అందించేందుకు నిర్ణయించారు. లయన్ పదం కుమార్ గుప్తా ఆర్థిక సహకారం అందించారు. సుంకర శ్రీనివాస్, చిన్నం జగదీష్, డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, సన్నిధి సూర్యనారాయణమూర్తి, పచ్చ వెంకటేశ్వరరావు, పడాల మహేశ్వరరావు, ఎర్ర ఆంజనేయస్వామి పాల్గొన్నారు.

నాగమ్మ తల్లి ఆలయంలో భక్తులకు సారె ప్రసాదం పంపిణీ

తణుకు అర్బన్: తణుకు జాతీయ రహదారి గౌతమి సాల్వెంట్ సమీపంలో ఉన్న శ్రీచక్రసహిత నాగదుర్గాదేవి (నాగమ్మ తల్లి) ఆలయంలో ఆదివారం భక్తులకు అమ్మవారి సారె ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈనెల 14వ తేదీన నాగమ్మ తల్లికి తణుకు పరిసర ప్రాంత భక్తులు సారె రూపంలో పసుపు, కుంకుమ, గాజులు, చీరలు, అరటిపండ్లు, మిఠాయిలను సమర్పించారు. ఈ సందర్భంగా నాగమ్మ తల్లిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఒక రోజు అమ్మవారి వద్ద నిద్రచేసిన అనంతరం సారెను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అందజేశారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- పొంచి ఉన్న ప్రమాదం..!
- పరవళ్లు తొక్కుతున్న కాలువలు
- తణుకు నియోజకవర్గంలో 287 గణేష్ శిబిరాలు



తణుకు పెద్ద వంతెన వద్ద నిమజ్జనానికి ఏర్పాట్లు

తణుకు: తొమ్మిది రాత్రుల పాటు భక్తుల పూజలు అందుకున్న గణనాథుడి విగ్రహాలు ఒకొక్కటిగా నిమజ్జనానికి తరలుతున్నాయి. నిమజ్జనోత్సవానికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించనప్పటికీ కేవలం ఆయా కమిటీలతో సమన్వయం చేసుకున్న పోలీసు, ఫైర్, విద్యుత్ శాఖ అధికారులు నిమజ్జనాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు నిమజ్జనాల రేవుల వద్ద అరకొర వసతులు, ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతో భక్తులు ఒక్కోసారి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇదిలా ఉంటే ఇటీవల కురుస్తున్న వర్షాలు కారణంగా గోదావరి తద్వారా ఉప కాలువలు పరవళ్లు తొక్కుతున్నాయి. ముఖ్యంగా తణుకు నియోజకవర్గంలోని గోస్తనీ నదితోపాటు వెంకయ్య వయ్యేరు, అత్తిలి కాల్వల్లో ఎక్కువ శాతం నిమజ్జనాలు జరుగుతుంటాయి. భారీ విగ్రహాల నిమజ్జనానికి విధిగా క్రేన్ ఏర్పాటు చేసుకోవాలి. నిమజ్జన ప్రదేశాల్లో క్రేన్లు, విద్యుత్ లైటింగ్‌తోపాటు ముందస్తు జాగ్రత్తగా గజ ఈతగాళ్లను కూడా సిద్ధంగా ఉంచితేనే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుంది. పైగా పోలీసు అధికారులు నిర్దేశించిన కాలువ రేవుల్లోనే నిమజ్జనాలు చేయాలి.

మొత్తం 287 మండపాలు ఏర్పాటు...

తణుకు నియోజకవర్గంలో తణుకు పట్టణంతో పాటు తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లో 287 గణష్ మండపాలు ఏర్పాటు చేశారు. తణుకు పట్టణంలో 46, మండలంలో 72, అత్తిలి మండలంలో 96, ఇరగవరం మండలంలో 73 మండపాలు ఏర్పాటు చేశారు. వీటిలో ఆదివారం 51 విగ్రహాలను నిమజ్జనం చేశారు. తణుకులో 14, రూరల్ పరిధిలో 15, అత్తిలి 16, ఇరగవరం 6 విగ్రహాలు చొప్పున నిమజ్జనాలు చేశారు. తణుకు నియోజకవర్గంలో ఇంకా 236 వినాయక విగ్రహాలు నిమజ్జనం చేయాల్సి ఉంది. అదనంగా అపార్ట్‌మెంట్లు, గ్రూపు హౌస్‌ల్లో, పలు వీధుల్లో చిన్న చిన్న విగ్రహాలను ఏర్పాటు చేశారు. వీటిని కూడా కలుపుకొంటే ఇంకా నిమజ్జనం చేయాల్సిన విగ్రహాల సంఖ్య 200 పైగా ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. మరోవైపు తణుకు పట్టణంలో పెద్ద వంతెన వద్ద, శివాలయం రోడ్డు, కొమ్మాయిచెరువుగట్టు, ఆంధ్రాసుగర్స్ వద్ద నిమజ్జనాలకు ఏర్పాట్లు చేయగా తణుకు మండలంలో దువ్వ వెంకయ్య వయ్యేరు, వేల్పూరు తదితర ప్రాంతాల్లో ఏర్పాట్లు చేశారు.

జాగ్రత్తలు తప్పనిసరి

తణుకు నియోజకవర్గంలో వినాయకచవితి పురస్కరించుకుని నవరాత్రులు పూజలు అందుకున్న గణనాథులు నిమజ్జనాలకు అధికారులు ఏర్పాట్లు చేసినప్పటికీ ఆయా కమిటీలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. నిమజ్జనానికి అధికారులు తొలుత నిర్దేశించిన ప్రాంతాల్లో మాత్రమే నిమజ్జనం చేసుకోవాల్సి ఉంది. నిమజ్జనాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా విద్యుత్ తీగలకు విగ్రహాలు తగలకుండా జాగ్రత్తలు పాటించాలి. నిమజ్జనోత్సవ ఊరేగింపు ముగించుకుని విగ్రహాలన్నీ పొద్దుపోయాకే కాల్వల వద్దకు చేరుకుంటాయి. ఈ సమయంలో యువకులు, చిన్నపిల్లలు, మహిళలు జాగ్రత్తగా వ్యవహరించాలి.

అన్ని ఏర్పాట్లూ చేశాం



కాల్వల్లో వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందున నిమజ్జనాలకు పటిష్ట ఏర్పాట్లు చేశాం. అన్ని ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు నియమించాం. ముఖ్యంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఎక్కడికక్కడే ట్రాఫిక్ సిబ్బందిని అప్రమత్తం చేశాం. విగ్రహాల ఊరేగింపులో ప్రజలకు ఆటంకాలు తలెత్తకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలి.

– జీవీవీ నాగేశ్వరరావు, సీఐ, తణుకు రూరల్

కొలిక్కి రాని స్కూటీల దహనం కేసు

తణుకు: తణుకు మండలం వేల్పూరు గ్రామంలో రెండు స్కూటీలు దహనం కేసు కొలిక్కిరాలేదు. గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ రెడ్డి నరేంద్రప్రసాద్‌కు చెందిన రెండు స్కూటీలను ఇంటి ఆవరణలోనే ఈనెల 10 రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోలు పోసి తగలబెట్టిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన తణుకు రూరల్ పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నాలుగు రోజులుగా పోలీసుల అదుపులోనే ఉన్న ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేయాల్సిన పోలీసులు తాత్సారం చేస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల వేల్పూరు గ్రామంలో రెండు గేదెలను అపహరించిన కేసులో నిందితులే మోటారు సైకిళ్లను దహనం చేసినట్లుగా ఆధారాలు ఉన్నప్పటికీ పోలీసులు వారిపై చర్యలకు వెనుకడుగు వేస్తున్నారు. తణుకు మండలం వీరభద్రపురం గ్రామానికి చెందిన చికెన్ దుకాణం యజమాని బండి రామలింగేశ్వరరావు అలియాస్ ఈశ్వరరావు గేదెల అపహరణలో ప్రధాన నిందితుడిగా పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేశారు. అయితే తాజాగా రెండు స్కూటీల దహనం కేసులో సైతం ఈశ్వరరావు అనుచరులు ఉన్నట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. అయితే గేదెలు అపహరణ కేసు నీరుగార్చేందుకు రూ. 12 లక్షలు చేతులు మారినట్లు అభియోగాలు రావడంతో ప్రస్తుతం స్కూటీల దహనం కేసును పోలీసులు నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వినబడుతున్నాయి.

నిమజ్జనాలకు తరలుతున్న గణనాథులు



తాడేపల్లిగూడెం పట్టణం కాగితవారి వీధిలోని లక్ష్మి గణపతి స్వామివారిని ఊరేగిస్తున్న దృశ్యం



తణుకులో నిమజ్జనానికి వెళ్తున్న కొచ్చెర్లకోట వారి వీధి 20 అడుగుల తెలంగాణ గణనాథుడు



తణుకు 14వ వార్డులో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి వేడుకలలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహన్ని ఊరేగింపు దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణంలోని గణనాథులు ఆదివారం నిమజ్జనాలకు బయల్దేరారు. ప్రధానంగా మసీదు సెంటర్ కాగిత వారి వీధిలోని లక్ష్మి గణపతి స్వామివారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలోఉంచి పుర మహోత్సవం నిర్వహించారు. డీజే సౌండ్, యువకుల నృత్యాల మధ్య స్వామివారి ఊరేగింపు నిమజ్జనానికి చేశారు. స్వామివారి తొమ్మిది కిలోల లడ్డూ ప్రసాదానికి శనివారం రాత్రి వేలం పాట నిర్వహించారు. ఈ లడ్డూను రూరల్ సర్కిల్ కార్యాలయ ఏఎస్సై బులిస్వామి రూ.11వేలకు కైవసం చేసుకున్నారు. ఉత్సవ కమిటి ఆరుగొల్లు ముత్యాలు వరప్రసాద్, మిద్దే ఏసురత్నం, బాడిలంక శేషగిరి, రాము, ఆరుగొల్లు వెంకట్రావు, వివేక్, గుబ్బల సత్యనారాయణ, వెంకట్ ఫ్రెండ్స్ సర్కిల్ యువకులు పాల్గొన్నారు.



తణుకులో గణనాథుడు నిమజ్జన ఊరేగింపులో ఆకర్షణగా నిలిచిన హనుమంతుడి వేషధారి

ఘనంగా గణనాథుడి నిమజ్జనం

తణుకు అర్బన్: వినాయకచవితి మహోత్సవాలు ప్రారంభించి 9 రోజులు పూర్తికావడంతో గణనాథుడి విగ్రహ ప్రతిమలు నిమజ్జనానికి వెళ్లే సందడి తణుకులో హోరెత్తింది. తణుకులో గణనాథుడి విగ్రహాల సందడితో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. ముఖ్యంగా తణుకులో శ్రీలక్ష్మీ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 20 అడుగుల ఎత్తైన కొచ్చెర్లకోట వారి వీధి తెలంగాణ గణనాథుడి నిమజ్జనం వేడుకగా జరిగింది. పాతపోలీస్ స్టేషన్ ప్రాంతం నుంచి ప్రారంభించిన ఊరేగింపు రాష్ట్రపతి రోడ్డు మీదుగా వేల్పూరు రోడ్డు, నరేంద్రాసెంటర్ మీద నుంచి పెద్ద వంతెన వద్దకు చేరి గణనాథుడిని గోస్తనీ కాలువలో నిమజ్జనం చేశారు. ప్రత్యేకంగా రూపొందించిన వాహనంలో ఆసీనులైన స్వామివారిని తీన్‌మార్ డప్పులు, బ్యాండు మేళాలు, భారీ ఏనుగు, హనుమంతుడి వేషధారులతోపాటు మేళతాళాలతో ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.



తణుకులో గణనాథుడి నిమజ్జన ఊరేగింపులో భారీ ఏనుగు బొమ్మ

తణుకు టౌన్: గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగింపు వేడుకలు తణుకు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తణుకు పట్టణంలోని పాతూరు 14వ వార్డులో కొమ్మాయి చెరువు వద్ద శ్రీగణపతి యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి వేడుకల ముగింపు సందర్భంగా ఆదివారం పట్టణంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని ట్రాక్టర్స్ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి వేడుకలలో ఆదివారం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ పౌరాణిక వేషధారణలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. వేల్పూరు గ్రామంలోని వివిధ చోట్ల ఏర్పాటు చేసిన వినాయక చవితి వేడుకలకు సంబంధించిన గణపతి నవరాత్రి వేడుకల ముగింపు సందర్భంగా భారీ ఊరేగింపు ఉత్సవాలను నిర్వహించారు. మండలంలోని మండపాక, దువ్వ, ముద్దాపురం, తేతలి గ్రామాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించారు.

చిన్నారులకు ఉచిత గుండె వైద్యపరీక్షలు

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు ట్రిపుల్ ఎఫ్ సంస్థ, స్వాభిమాన్ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు ఉచిత గుండె వైద్య శిబిరం (స్క్రీనింగ్ పరీక్షలు) నిర్వహించారు. ఈ శిబిరంలో హైదరాబాద్ స్టార్ ఆస్పత్రికి చెందిన గుండె వైద్యనిపుణులు డాక్టర్ సుమన్ వ్యాస్ బృందం పాల్గొన్నారు. ఫిడ్రియాటిక్, కార్డియాలజీ నిపుణుల పర్యవేక్షణలో ట్రిపుల్ ఎఫ్ ప్రతినిధి ఓం ప్రకాష్‌గోయంకా ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. పలు జిల్లాల నుండి పేర్లు నమోదు చేయించుకొన్న సుమారు 59 మందికి ఈ వైద్య సేవలు నిర్వహించారు. 1 నుంచి 14 సంవత్సరం లోపు చిన్నారులు, వైద్యపరీక్షలు చేయించుకొన్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుండి 70 మంది రిజిస్ట్రేషన్ చేయించుకోగా వారిలో 59మంది చిన్నారులకు గుండె లోపాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు ట్రిపుల్ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పరిశీలించారు. చిన్నారులకు గుండె స్క్రీనింగ్ పరీక్షలు చేయించడం పట్ల ట్రిపుల్ ఎఫ్ యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. సంస్థ ప్రతినిధులు జనార్ధన్, జీఎం హెచ్ఆర్ వేమాల శ్రీనివాస్, కో ఆర్డినేటర్ జి. శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహించే ఇంటింటికి వైద్యసేవల కార్యక్రమంలో 9 మంది వృద్ధులకు వైద్య సేవలు అందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా తణుకు పట్టణం, వేల్పూరు, ఇల్లిందలపర్రు, కె సావరం పరిసర గ్రామాల్లోని మంచం నుంచి లేవలేని వృద్ధులకు వద్దకు వెళ్లి అవసరమైన వైద్య పరీక్షలు చేసి వైద్య సూచనలు, సలహాలు అందించారు. సంఘ సభ్యులు దాట్ల రామరాజు ఆర్థిక సహాయంతో మందులను ఉచితంగా అందజేశారు. కార్యదర్శి ఎండీ స్వాహాలిక, కోశాదికారి ఆర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ సేవలు మరువలేనివని పలువురు వక్తలు తెలిపారు. గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఇద్దరు పేద విద్యార్థినీలకు అదివారం సాయం అందజేశారు. పేద ఇంజనీరింగ్ విద్యార్థినీ సత్యవాణికి కళాశాల బస్సు ట్రాన్స్‌పోర్టు నిమిత్తం, బుక్స్‌కి రూ.20వేలు ఆర్థిక సాయాన్ని ఆర్గనైజేషన్ ట్రస్టీ, వైఎస్సార్ సీపీ నాయకులు చెన్నా జనార్ధనరావు అందజేశారు. రెండో కుమార్తె మధుప్రియకు సైకిల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమా, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీర్లకు మార్గదర్శి విశ్వేశ్వరయ్య



తణుకు లయన్స్ క్లబ్‌లో ఇంజనీర్లను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు, నాయకులు

తణుకు టౌన్: ఆనకట్టలు, జలాశయాలు, విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజనీర్లకు మార్గదర్శిగా నిలిచారని మాజీ ఎమ్మెల్యే చిట్టూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా తణుకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సప్పా బలరామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంజనిర్స్ డే వేడుకలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఇంజనీర్లు పంచాయతీ రాజ్ డీఈఈ బీ విజయకుమార్, పంచాయతీ రాజ్ ఏఈ ఎం నీల్ ఆలిస్టన్, జియో ఇంజనీర్ కే సాయి ప్రవీణ, ఇరగవరం పంచాయతీ ఇంజనీర్ ఎస్ సాయి రామకృష్ణలను లయన్స్ క్లబ్ తరఫున ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి ఎం రవి రిజనాల్డ్, కోశాధికారి చీకటి శ్రీనివాసరావు, లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ డీ రంగారావు, లయన్స్ నాయకులు కడియాల సూర్యనారాయణ, నల్లజర్ల వెంకటేశ్వరరావు, ఆకుల వెంకటేశ్వరరావు, పీవీ రమణ, ఎంఆర్ కోటేశ్వరరావు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. తణుకులోని చిట్టూరి హెరిటేజ్‌లో జిల్లా లైసెన్స్ టౌన్‌ప్లానర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెలగన శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో ప్రఖ్యాత ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ రఘునందనరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్‌వీ కృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శి కేపీ నాయుడు, కోశాధికారి పీ పెద్దిరాజు,లతో జిల్లాలోని పాలకొల్లు, నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం తణుకు ప్రాంతాలకు చెందిన ఇంజనీర్‌లు పాల్గొన్నారు.



నిట్‌లో ఇంజనీర్స్‌డే వేడుకలు



డైమండ్స్ వారిచే ఇంజనీర్స్‌డే వేడుకలు

లయన్స్‌క్లబ్ డైమండ్స్ ఆధ్వర్యంలో ఇంజనిర్స్‌డే వేడుకలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా డైమండ్స్ క్లబ్ అధ్యక్షుడు చెన్నారెడ్డి సతీష్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సబ్ డివిజన్ కార్యాలయం ఇంజనీర్ రాజా శ్రీనివాస్‌ను ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మునగాల జితేంద్రకుమార్, నార్ని చిన్ని, ఆకుల సతీష్, వీర్ల శివ, సుందర్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

దేశ నిర్మాణంలో ఇంజనీర్లే కీలకం

తాడేపల్లిగూడెం: దేశ నిర్మాణంలో ఇంజనీర్లు క్రియాశీలక భూమిక పోషిస్తారని ఏపి నిట్ డీన్ డాక్టర్ జీబి.వీరేష్‌కుమార్ అన్నారు. ఇంజనీర్సుడేను పురస్కరించుకొని ఆదివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇంజనీర్లు దేశ ప్రగతికి రూపశిల్పులన్నారు. దేశ భవిష్యత్‌ను రూపొందించడంలో ఇంజనీర్లు చేస్తున్న నిర్విరామకృషి వెలకట్టలేనిదన్నారు. భారతదేశ ఖ్యాతిని ప్రపంచం నలుమూలలా చాటిచెప్పిన గొప్ప ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అన్నారు. ప్రపంచం ఎదుర్కొంటున్న పలు సవాళ్లు, సంక్షోభాలకు పరిష్కారం చూపే వైవిధ్య భరితమైన ఆవిష్కరణలను చేపట్టడంతో పాటు , వాటి ద్వారా అపార అవకాశాలను సృష్టించాలని విద్యార్థులను కోరారు. ఆచార్యులు వి.సందీప్, డాక్టర్ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.